క్లుప్తంగా

వేడుకగా పందిర్రాట



ఉమా సదాశివాలయంలో పందిర్రాట మహోత్సవాన్ని జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థాన క్షేత్ర పాలకులైన ఉమా సదాశివాలయంలో స్వామి వారి పందిర్రాట మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో స్వామి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించి, వేద మంత్రోచ్చారణల నడుమ కార్యక్రమం జరిగింది. ఈ నెల 30వ తేదీ రాత్రి 8 గంటలకు ఉమా సదాశివుడి కల్యాణం నేపథ్యంలో పందిర్రాట వేసినట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీనివాసమూర్తి మృతి తీరనిలోటు

విజయనగరం టౌన్: డబ్బింగ్ కళాకారుడు శ్రీనివాసమూర్తి మృతి కళారంగానికి తీరనిలోటని విజయభావన ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, శ్రీనివాసమూర్తి తన అన్న ఏవీఎస్ మూర్తి కుమారుడని, విజయనగరం నుంచి చెన్నై వెళ్లి స్థిరపడ్డారన్నారు. మృతుడు డబ్బింగ్ రంగంలో ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్నారన్నారు. తమిళ, తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

నెల్లిమర్ల: ఫిబ్రవరి 1వ తేదీన నిర్వహించే ఇఫ్టూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి రొంగలి అప్పలరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక అమరవీరుల భవనంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నెల్లిమర్ల పట్టణంలోని అమరవీరుల భవన్‌లో అదే రోజు సాయంత్రం అమరులైన నెల్లిమర్ల జూట్‌మిల్లు కార్మికుల సంస్మరణ సభ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అరుణోదయ, పీఓడబ్ల్యూ నాయకులు అప్పలసూరి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



పుష్పగిరి గ్రామంలో సూర్యభగవానుడి ఊరేగింపు

జామి: మండలంలోని పుష్పగిరి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను ఆలయ అర్చకులు రవిస్వామి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పాలు పొంగించడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సూర్య భగవానుడి విగ్రహన్ని ఊరేగించారు. భీమసింగి వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు వరప్రసాద స్వామి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆదిత్య హృదయ పారాయణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

లేఅవుట్‌లకు పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం

బొండపల్లి: జగనన్న లేఅవుట్‌లలో పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని, ఇళ్ల నిర్మాణదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసు కోవా లని ఎంపీపీ చల్ల చలం నాయుడు, మండల ప్రత్యేక అధికారి డి.ఎల్.వి.దుర్గాప్రసాద్ విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో శనివారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాలనీల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు త్వరగా చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు,బాలింతల ను గుర్తించి వారికి మంచి పౌష్టికాహారం అందించేలా చూడాలని బొండపల్లి, దేవుపల్లి పీహెచ్‌సీల వైద్య సిబ్బందికి, ఐసీడీఎస్ అధికారులకు సూచించారు.

సమన్వయంతో పనిచేయాలి

గజపతినగరం: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి పి.రమేష్ సూచించా రు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. మరుపల్లి పశువైద్యాధికారి మాట్లాడుతూ మండలంలోని 15,750 గొర్రెలు, మేక పిల్లలకు ఫిబ్రవరి 1న నుంచి పీపీఆర్ వ్యాక్సిన్ వేయనున్నామని, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవ సాయ, వైద్య, రెవెన్యూ, హౌసింగ్, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు తమ శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఎంపీడీఓ కిశోర్‌కుమార్, సీనియర్ పరిపాలన అధికారి పి.సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

ప్రత్యక్ష దైవం సూర్యుడ్ని పూజిస్తే రుణ, రోగ, శత్రు బాధలు తీరుతాయన్నది నమ్మకం. మాఘ శుద్ధ సప్తమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ దేవాలయాల్లో సూర్యదేవుడికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ప్రజలందరూ తలపై జిల్లేడు, రేగు ఆకులు పెట్టుకుని నదులు, చెరువుల్లో పుణ్య స్నానాలాచరించారు. జిల్లా కేంద్రంలోని శివపంచాయతన ఆలయంలో కొలువైన సూర్యనారాయణ స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కట్టెల పొయ్యిపై క్షీరాన్నం తయారు చేసి స్వామివారికి నివేదించారు. రామనారాయణంలో ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు ఆధ్వర్యంలో అర్చకులు చాణక్య, శ్రీహర్షలు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. విజ్ఞానభారతి పాఠశాలలో విద్యార్థులకు సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించారు. దేవదాయశాఖ రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ భానురాజా, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ ప్రచారక్ వంశీ సూర్యనమస్కారాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

– విజయనగరం నెట్‌వర్క్



విజయనగరం రూరల్: రామనారాయణంలో ప్రసాదం తయారు చేస్తున్న అర్చకుడు



శివపంచాయతన ఆలయ ప్రాంతంలో పాలు పొంగిస్తున్న మహిళలు



సూర్యనారాయణ స్వామికి హారతిస్తున్న అర్చకుడు



విజయనగరం ఫూల్‌బాగ్: పాలు పొంగిస్తున్న దేవదాయ శాఖ రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ భానురాజా



విజయనగరం ఫూల్‌బాగ్: పాఠశాల ఆవరణలో సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు



జిల్లా కేంద్రంలోని శివ పంచాయతన ఆలయంలో స్వామిని వారిని దర్శించుకుంటున్నభక్తులు

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎర్రయ్యమ్మ, అనురాధ

విజయనగరం ఫోర్ట్: కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గనివాడ ఎర్రయ్యమ్మ, బి. అనురాధ సూచించారు. నగరంలోని కస్పా హైస్కూల్, వీటీ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సఖి గ్రూపు సమావేశాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాల్య వివాహాలు అరికట్టడం వల్ల ఆడపిల్లలు ఆరోగ్యంగా ఉంటారని , అందువల్ల బాల్య వివాహాలు ఎక్కడ జరగకుండా చూడాలని తెలిపారు. ఆడపిల్లలు తమకు తాము ఏవిధంగా రక్షించుకోవాలో అవగాహన కల్పించారు. అదేవిధంగా గుడ్ టచ్ , బ్యాడ్ టచ్‌పై వివరించారు. రక్తహీనత బారిన పడకుండా బాలికలందరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆపదలో ఉన్నప్పుడు 1098, 100, 112 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎర్రయ్యమ్మ

కేంద్ర బృందం పర్యటన



లచ్చింపేటలో ప్రజలతో మాట్లాడుతున్న కేంద్రబృందం

లక్కవరపుకోట: మండలంలోని లచ్చింపేట, జమ్మాదేవిపేట గ్రామాల్లో కేంద్ర రీసెర్చ్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్ ప్రతినిధులు శనివారం పర్యటించారు. పింఛన్ లబ్ధిదారులు, ఉపాధి వేతనదారులతో మాట్లాడుతూ పింఛన్, ఉపాధి వేతనాలపై ఆరా తీశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై ఉపాధి, వెలుగు, హౌసింగ్, ఐసీడీఎస్ శాఖల అధికారులతో సమీక్షించారు. హౌసింగ్ డీఈ శ్రీనివాస్, ఎంపీడీఓ కె.రూపేష్, ఏపీడీ శారదాదేవి, ఈఓపీఆర్డీ జ్ఞానేశ్వరరావు, అప్పలనాయుడు, ఏఈ చంద్రకళ పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తించాలి

- అంకాలజిస్ట్ మృత్యుంజయరావు



కార్యక్రమంలో పాల్గొన్న ఉమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ గ్రీవెన్స్ సెల్ సభ్యులు

విజయనగరం అర్బన్: కాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తించాలని.. చివరి దశలో గుర్తించడం వల్లే మరణాలు సంభవిస్తున్నాయని మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్ రేడియేషన్ అంకాలజిస్ట్ ఎం.మృత్యుంజయరావు అన్నారు. శనివారం స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ)లో ఇంజినీరింగ్ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో 'కాన్సర్ రిలేషన్ అంశాల'పై శనివారం జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్యాన్సర్‌ను ముందుగా గుర్తించగలిగితే ప్రాణ నష్టాన్ని తగ్గించుకోవచ్చన్నారు. కాన్సర్‌లోని రకాలు, వాటిని ఎలా గుర్తించాలన్న అంశాలపై వివరించారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం, పండ్లు తీసుకోవడంతో పాటు రోజుకు సుమారు నాలుగు లీటర్ల నీరు తాగాలన్నారు. అలాగే హెచ్‌పీవీ అనే వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల భవిష్యత్‌లో క్యాన్సర్ రాకుండా నివారించవచ్చని చెప్పారు. రిసోర్స్ పర్సన్‌గా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి న్యూట్రీషియన్ ఎల్.స్వర్ణలత, వీఐపీఎస్ విశాఖ అసోసియేట్ ప్రొఫెసర్ బి.రమాదేవి, స్టూడెంట్ కోఆర్డినేటర్లుగా సీహెచ్‌వై దీప్తి, పి.లక్ష్మి, జి.యువరాజేష్ వ్యవరించారు. అనంతరం ముఖ్య అతిథిని ఘనంగా సత్కరించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ గ్రీవెన్స్‌సెల్ కన్వీనర్ డాక్టర్ జి.జయసుమ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.నళిని, ఎవాల్యూయేషన్, ఎంపవర్‌మెంట్ అండ్ గ్రీవెన్స్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ డి.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.హేమ, ఈఈఈ విభాగాధిపతి ఎ.పద్మజ, సీఎస్‌ఈ విభాగాధిపతి పి.అరుణకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సీహెచ్.బిందుమాధురి, మహిళా ఉద్యోగులు, 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న భక్తులు

గజపతినగరం: మండల కేంద్రంలోని దిగువ వీధిలో పైడితల్లి అమ్మవారి ఆలయ పునః ప్రారంభోత్సవాలను మాజీ సర్పంచ్ కందుల చిన్నయ్యస్వామి ఆధ్వర్యంలో శ్రీరామదూత సేవాసంఘం సభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదానం చేశారు.

ముగిసిన ప్రతిష్ఠోత్సవాలు

దత్తిరాజేరు: మండలంలోని ఆర్.రామచంద్రాపురంలో సర్పంచ్ బేత శ్రీదేవి, రవి దంపతులు పునర్నిర్మించిన బంగారమ్మతల్లి ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. మూడురోజులుగా వేదపండితులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఆలయం గోపురంపై పూర్ణ కలశాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం అన్న సమారాధన చేశారు.



దత్తిరాజేరు: ఆలయగోపురంపై పూర్ణ కలశాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన పూజల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడు పంచాయతీ శివారు కొత్తపాలెం గ్రామంలో దేవదాయ ధర్మాదాయ శాఖ నుంచి మంజూరైన రూ.30 లక్షలతో రామాలయం నిర్మాణానికి గ్రామపెద్దల ఆధ్వర్యంలో శనివారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున్, గ్రామ పెద్దలు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు పూజలు చేశారు.

రూ.2 లక్షల విరాళం

రామాలయం నిర్మాణానికి మల్లివీడు గ్రామానికి చెందిన బోను సన్యాసిరావు(సన్ని) రూ.2 లక్షలు విరాళం ప్రకటించారు. ఆలయ నిర్మాణ కమిటీకి శనివారం రూ.లక్ష అందజేశారు.మిగతా లక్ష రూపాయాలు నిర్మాణం అనంతరం ఆలయానికి రంగులు వేసేందుకు అందజేయనున్నట్లు దాత తెలిపారు.

ఆరోగ్యశ్రీ ద్వారా ప్రసవాలు



బాలింతతో మాట్లాడుతున్న డాక్టర్ అప్పలరాజు, డాక్టర్ గౌరీశంకర్

విజయనగరం ఫోర్ట్: గర్భిణులకు ఆరోగ్యశ్రీ ద్వారా ప్రసవాలు జరిపించాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బి. గౌరీశంకర్ అన్నారు. శనివారం స్థాని ఘోషా ఆస్పత్రిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ ద్వారా బాలింతలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ పథకం పేదలకు ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకం ద్వారా పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా ఆరోగ్య ఆసరా కింద మహిళలకు రూ. 5 వేల ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చిరస్మరణీయుడు కోడి రామ్మూర్తి

- నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి
- పలువురు సీనియర్ క్రీడాకారులకు సత్కారాలు



సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు కోటేశ్వరరావును సత్కరిస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్, నిర్వాహకులు

విజయనగరం: జిల్లా కీర్తిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మల్లయోధుడు కోడి రామ్మూర్తి చిరస్మరణీయుడని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని కోడి రామ్మూర్తి పార్క్‌లో ఆయన జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ పెద్ది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ముందుగా కోడి రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ, కోడి రామ్మూర్తి ద్వారా విజయనగరం కీర్తి దిగంతాలకు వ్యాప్తి చెందిందన్నారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, రామ్మూర్తి పేరిట ఏర్పాటు చేసిన పార్క్‌ను రూ. 22 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా తెలగ సంక్షేమ సంఘ పూర్వపు అధ్యక్షుడు పీవీ రామారావు, కోడి రామ్మూర్తి వ్యాయామ సంఘ ప్రతినిధులు పెనుమజ్జి విజయలక్ష్మి, ఒబ్బిలిశెట్టి రామ్‌జీ, ఒబ్బిలిశెట్టి ఏడుకొండలు, పీవీ నరసింహరాజు (బుచ్చిబాబు), ప్రముఖ న్యాయవాది ఫోర్ ఎస్ రాజు, మాజీ కౌన్సిలర్ పతివాడ భాస్కరరావు, తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వెయిట్ లిఫ్టింగ్ , పవర్ లిఫ్టింగ్, ఖోఖో, కబడ్డీ, తైక్వాండో క్రీడలలో రాష్ట్ర, జాతీయ స్థాయిలలో పతకాలు సాధించిన పలువురు కోచ్‌లు, క్రీడాకారులను సత్కరించారు. కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు, క్రీడాభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

సామాన్యులకు చేరువగా వాకర్స్ క్లబ్ సేవలు



గవర్నర్ కర్రోతు సత్యంను సత్కరిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

- వాకర్స్ గవర్నర్ కర్రోతు సత్యం

విజయనగరం: వాకర్స్ క్లబ్ సేవలు సామాన్యులకు చేరువకావాలని వాకర్స్ గవర్నర్ కర్రోతు సత్యం ఆకాంక్షించారు. పట్టణంలోని మహరాజా లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో వనిత వాకర్స్ క్లబ్ పోర్టు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ కర్రోతు సత్యం మాట్లాడుతూ, నడక ఆవశ్యకతను వివరిస్తూ ఏర్పాటైన వాకర్స్ క్లబ్‌లు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరువ కావాలని సూచించారు. అనంతరం పూర్వ గవర్నర్ కృష్ణంరాజు, ఎస్ఎస్ఎస్ఎస్ రాజు, డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి, ఎలక్ట్ గవర్నర్ శ్రీరామ్మూర్తి, తదితరులు ప్రసంగించారు. నూతన అధ్యక్షులుగా సీహెచ్ సాయి సంతోషిణి, కార్యదర్శిగా సత్యలత, కోశాధికారిగా ఎం.పార్వతితో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కార్యవర్గ సభ్యులు గవర్నర్ కర్రోతు సత్యంను సత్కరించారు. కార్యక్రమానికి పట్టణంలోని వివిధ వాకర్స్ క్లబ్‌ల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొండకరకాంలో హౌసింగ్ డే



కొండకరకాంలో హౌసింగ్ డే నిర్వహిస్తున్న అధికారులు

విజయనగరం రూరల్: మండలంలోని కొండకరకాంలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఎంపీడీఓ గంటా వెంకటరావు ఆధ్వర్యంలో మండల శాఖ అధికారులు జగనన్న కాలనీలో పర్యటించి, లబ్ధిదారులతో మాట్లాడారు. వచ్చే ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి చేయాలని, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కలిప్తామని చెప్పారు. నిర్మాణాల్లో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమ్య, హౌసింగ్ ఏఈ వర్మరాజు, పీఆర్ జేఈ గణేష, ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు, ఎలక్ట్రికల్, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ పథకం అధికారులు, పంచాయతీ కార్యదర్శి రవి, గ్రామపెద్దలు రాంబాబు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్ అగ్రహారానికి చెందిన ఎడ్ల సత్యనారాయణ 12 మద్యం సీసాలు తరలిస్తుండగా శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఈ.రామకృష్ణ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.